క్లుప్తంగా

మంత్రి మల్లారెడ్డిని కలిసిన నాయకులు



మల్లారెడ్డితో చందర్‌రావు, నాయకులు

కల్లూరు: రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డిని బీఆర్‌ఎస్ నాయకులు, రైతు సమితి జిల్లా కమిటీ సభ్యులు పసుమర్తి చందర్‌రావు మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బంకాబాబు, రాజబోయిన శ్రీను తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని వందనం గ్రామానికి చెందిన అమరబోయిన వెంకన్నతో పాటు మరి కొంతమందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ అలీ 2019లో వెంకన్న వద్ద వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమికి మహబూబ్ అలీ గత నెల 25న ఫెన్సింగ్ రాళ్లను ఏర్పాటు చేయగా రాళ్లను వెంకన్నతో పాటు మరి కొంతమంది వాటిని ధ్వంసం చేశారు. ఈ మేరకు మహబూబ్ అలీ ఫిర్యాదు మేరకు ఎస్సై పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కల్లూరు: కల్లూరులోని పుల్లయ్యబంజర్ రోడ్డులో నివాసముంటున్న యువతి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదైంది. షాపింగ్ కోసం సోమవారం బయటకు వెళ్లిన ఆమె మంగళవారం సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో యువతి మేనమామ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మధిర: మండల పరిధిలోని ఆత్కూర్ గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ అబ్బూరి సంధ్యా మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కంభంపాటి చిట్టిబాబు, ఎంపీటీసీ మీనుగు పాండురంగారావు, వార్డు సభ్యులు కృష్ణ, లాలు, పంచాయతీ కార్యదర్శి వేముల కిరణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

20న 'చలో హైదరాబాద్'

ఏన్కూరు: జూన్ 20న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీల 10 శాతం రిజర్వేషన్ కేంద్రప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. మైదాన ప్రాంతంలో ఎస్టీ గిరిజనుల కోసం జిల్లా కేంద్రంలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేష్ నాయక్, శివనాయక్, రామ్‌నాయక్, బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

నివాళి

కారేపల్లి: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన తాతా గురువయ్య (85) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మాలోతు శకుంతల, వైఎస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏపూరి లలితాదేవి, బొల్ల రామస్వామి, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, రైతుబంధు మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సర్పంచ్‌లు ఇందిరాజ్యోతి, కిషోర్, ఎంపీటీసీలు అజయ్‌బాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, సాంబ, కుమార్, బన్సిలాల్, రాము పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో గ్రామస్తులకు సంపూర్ణ సురక్ష హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్ నిరోషా మాట్లాడారు. అనంతరం ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ మొగిలి అప్పారావు, గ్రామ కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఎం.రవిరాజా, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్‌ఎం స్నేహ, లింక్ వర్కర్లు సుశీల తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కావలెను..!

ఎర్రుపాలెంలో రెగ్యులర్ అధికారులు లేక అవస్థలు

- ఇన్‌చార్జ్‌లతో కొరవడుతున్న పర్యవేక్షణ
- సరైన సేవలు అందక ప్రజల ఆవేదన



విద్యాశాఖ కార్యాలయం



తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న మహిళలు (ఫైల్)

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని పలు అభివృద్ధి, సంక్షేమ శాఖలకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయక, మధిర మండల అధికారులనే ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తున్నారు. ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణ లోపంతో పాలన పడకేసింది. మండలంలో మిషన్ భగీరథ స్కీంకు మధిర ఏఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ శాఖకు మధిర ఏఈ రాజేష్, ఎంఈఓగా వై.ప్రభాకర్‌రావు, మండలపరిషత్ ఏఈగా పీఆర్ ఏఈ నరేష్ ఇలా దాదాపు అందరూ మధిర అధికారులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

వేధిస్తున్న తాగునీటి సమస్య

మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా అందడం లేదు. గట్లగౌరారం, సత్యనారాయణపురం గ్రామాలకు ఏళ్ల తరబడి నీరు అందకపోగా స్థానికులు అవస్థ పడుతున్నారు. కొన్నిచోట్ల పైపులైన్ల నిర్మాణం కూడా పూర్తికాలేదు. బోడేపూడి సృజల స్రవంతి స్కీం పైపులైన్ల ద్వారానే భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు.

కొన్ని శాఖల్లో ఇదీ పరిస్థితి..

- మండల పరిషత్ కార్యాలయంలోని పీఆర్ ఏఈ పోస్టు దీర్ఘకాలంగా భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యత పీఆర్ ఏఈ నరేష్‌కు అప్పగించారు. ఫలితంగా పీఆర్‌లో రోడ్ల నిర్వహణ నామమాత్రంగా కొనసాగుతోంది. రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు.
- దశాబ్ద కాలంగా ఎంఈఓ పోస్టు భర్తీకి నోచుకోవడం లేదు. ప్రస్తుతం మధిర ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండగా.. విద్యాసంవత్సరం ఆరంభం కానున్న సమయంలో రెండు మండలాల్లో పర్యవేక్షణ కష్టంగా మారింది. పర్యవేక్షణ లోపించడంతో ఉపాధ్యాయుల్లో కొందరు సక్రమంగా విధులకు హాజరు కాకపోగా, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. పలు పాఠశాలల్లో టీచర్లు అనధికారికంగా వలంటీర్లను నియమించుకుని విధులకు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలున్నాయి.
- ఆర్‌అండ్‌బీ శాఖకు ఏళ్లుగా రెగ్యులర్ ఏఈ లేరు. మధిర ఏఈ రాజేష్‌కు ఎర్రుపాలెం ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. గ్రామాల్లో రూ.కోట్లాది వ్యయంతో బీటీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నా పర్యవేక్షణ కష్టమవుతోంది. దీంతో నాణ్యత లోపిస్తుందనే విమర్శలున్నాయి.

వడ్డీకి తెచ్చి బోరు వేశాం..



మా జీపీ పరిధిలోని సత్యనారాయణపురం, గట్లగౌరారానికి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. తాగునీరు అందక గ్రామస్తులు ఇటీవల ఆందోళన కూడా చేశారు. దీంతో రూ.లక్ష వడ్డీకి తీసుకొచ్చి తాగునీటి బోరు వేశాం. అధికారులు స్పందించి గ్రామాలకు భగీరథ పథకం నీరు సరఫరా చేయాలి.

– వెర్రు వెంకట్రావు, సర్పంచ్, గట్ల గౌరారం

రెగ్యులర్ ఎంఈఓ లేకపోతే కష్టమే



మండలానికి రెగ్యులర్ ఎంఈఓ లేకపోతే ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల పర్యవేక్షణ కష్టంగా ఉంటుంది. పర్యవేక్షణ లోపంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పరిస్థితి నెలకొంది. దశాబ్దాలుగా ఇన్‌చార్జిలతోనే పర్యవేక్షణ సాగుతున్నందున ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి.

– రుద్రపోగు శ్రీను, ఉపాధ్యాయుడు, ఎర్రుపాలెం

ఇన్‌చార్జ్‌లు ఉన్న మాట వాస్తవమే..



మండలంలోని పలు శాఖలకు ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్న మాట వాస్తవమే. మిషన్ భగీరథ, పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యాశాఖకు మధిర అధికారులే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొంతమేర కష్టంగా ఉంది. ఇక్కడ ఎదురవుతున్న సమస్యను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– బి శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎర్రుపాలెం

అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్



ప్రచారం నిర్వహిస్తున్న సంభాని చంద్రశేఖర్

పెనుబల్లి : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌తో పాటు ఒకే సారి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. మండలపరిధిలోని అగ్రహారంలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్ వైఫల్యాలను, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెలికాని రాజబాబు, నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, రామిశెట్టి మనోహర్‌నాయుడు, మేకతొట్టి కాంతయ్య, దేసిన్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను జయప్రదం చేయాలి

ఏన్కూరు: ఈ నెల 11న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజాగర్జనను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం బహిరంగసభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తు ప్రజాస్వామ్య, రాజ్యాంగా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రబాబు, జాగర్లమూడి రంజిత్‌కుమార్, అమరనేని వీరభద్రం, పెరబోయిన బంగారి, యాలమద్ది రామారావు, సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.



ఏన్కూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. మండలంలోని గంగారంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల జీవితం అతలాకుతలం అవుతుందని, ఏరి కొనలేని.. తినలేని దుస్థితి దేశంలో ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో లోయ నాగరాజు, సైదులు, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, సావిత్రి, లక్ష్మి, వెంకమ్మ, మల్లేశ్వరి, జయమ్మ, రాములమ్మ, పాపాయమ్మ పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న ఆదినారాయణ

కానిస్టేబుల్‌కు ఉత్కృష్ట సేవా పతకం



పతకం అందుకుంటున్న లక్ష్మీపతి

పెనుబల్లి: వియంబంజర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి.లక్ష్మీపతి ఉత్కృష్ట సేవ పతకాన్ని మంగళవారం కలెక్టర్ వీపీ గౌతమ్ చేతుల మీదుగా అందుకున్నారు. బ్లూ కోర్టులో కానిస్టేబుల్‌గా తనకు డయల్ 100 ద్వారా వచ్చిన కాల్స్‌తో పాటు తన దృష్టికి వచ్చిన ఎన్నో ఫిర్యాదులను పరిష్కరిస్తూ, ప్రజలతో మమేకమై వారికి సాయం అందిస్తున్నందుకు ఈ పతకం అందజేశారు. ఈ మేరకు పలువురు లక్ష్మీపతిని అభినందించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన

ముదిగొండ: ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ వెంకటాపురంలో గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఇళ్లస్థలాలు పంపిణీ కోసం సిద్ధం చేసిన భూమిలో గ్రామస్తులు కర్రలు పాతి చీరలు కట్టి గుడిసెలు వేశారు. తమ పూర్వీకులు ఉన్న ఇళ్ల స్థలాలు తమకే ఇవ్వాలని కొంతమంది గ్రామస్తులు డిమాండ్ చేశారు. అర్హులైన తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు కోరారు. రెవెన్యూ అధికారులు, ఆర్ఐ వహిదా, ఖమ్మం రూరల్ ఎస్సై షకీర్‌లు గుడిసెలు వేసుకున్న గ్రామస్తులతో మాట్లాడారు. కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించమని ఎస్సై గ్రామస్తులకు వివరించారు.

13న మహిళా దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఏన్కూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13న మండల కేంద్రంలో వైరా నియోజకవర్గ స్థాయి మహిళాదినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు డీపీఎం ఫైనాన్స్ వైరా నియోజక వర్గ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐకేపీ సీసీలకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కమ్మవారి కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహిస్తుండగా అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఏపీఎం హరినారాయణ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

మధిర: మండల పరిధిలోని నాగవరప్పాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేటువంటి పిల్లల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంగారావు, అంగన్‌వాడీ టీచర్లు అంజలీ, వరలక్ష్మీ, హెల్పర్ అక్కమ్మ పాల్గొన్నారు.

బడిబాట

కల్లూరు రూరల్: మండలంలోని పెద్దకోరుకొండిలో హైస్కూల్ టీచర్లు మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం నామా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దంతాల సుధాకర్, రాములు, రేణుక, అనిత, పుల్లయ్య, రాజు, సరస్వతి, నిర్మల, జరీనా పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు 210 దరఖాస్తులు



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

వైరా: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు సోమవరం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే ప్రక్రియను రెవెన్యూశాఖ అధికారులు చేపట్టారు. గ్రామంలో ఉన్న ఒకటిన్నర ఎకరాల అసైన్‌మెంట్ భూమిలో 50 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వెసులుబాటు ఉంది. కొంతకాలంగా ఆ స్థలంలో ఉన్న ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ అధికారులు ఇప్పుడు అర్హులైన స్థానిక పేదలకు 75 గజాల స్థలానికి పట్టాలిచ్చేందుకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ నారపోగు అరుణ ప్రకటించారు. ఈ నెల 2 నాటికి 210 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల వడపోతల భాగంగా నిజమైన లబ్ధిదారులకు సంబంధించి అభ్యంతరాల కోసం మంగళవారం సోమవరంలో గ్రామసభ నిర్వహించారు. ఇప్పటికే ఇళ్ల స్థలాలను సిద్ధం చేశారు. ఈ నెల 9న ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నారపోగు అరుణ, ఆర్ఐలు ఎం. వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, కౌన్సిలర్ దారెల్లి పవిత్రకుమారి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ రాంబాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రాంబాబు, దయాకర్‌రెడ్డి

మధిర: మధిరకు చెందిన డాక్టర్ కోట రాంబాబు జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

తల్లాడ: మండలంలోని రంగంబంజర గ్రామంలో మంగళవారం 30 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు జరిగాయి. బుధవారం అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో యాగశాల వద్ద హోమ పూజలు జరిగాయి.

భోజన కార్మికుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

సత్తుపల్లిరూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2022–23 సంవత్సరానికి సంబంధించి బిల్లులు కోడిగుడ్ల బకాయిలు రాష్ట్రం 9, 10వ తరగతుల పిల్లలకు ప్రత్యేక మెనూ ఛార్జీలు, కేసీఆర్ పెంచిన వేతనాన్ని ఏరియల్‌తో సహా విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే కొన్న ఏజన్సీల్లో గత సంవత్సరం కిరాణాషాప్, కూరగాయలు, కోడిగుడ్ల షాపుల వద్ద బకాయిలు పెరిగిపోయాయన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు తెల్లగొరపు రామారావు, తడికమళ్ల యోబు, జరీనా, కృష్ణవేణి, కనకదుర్గ, సుక్కమ్మ, లక్ష్మీ, పూచి సీత పాల్గొన్నారు.

ముందస్తుగా పంటలు వేసుకోవాలి

కొణిజర్ల: రైతులు పంటల సాగు కాలం ముందుకు జరిపి ఈ నెల 25 లోగా వరి నార్లు పోసుకుంటే ముందుగానే పంట చేతికి వచ్చి రైతులు ప్రకృతి ప్రకోపానికి గురి కాకుండా ఉండొచ్చని ఏఓ దొడ్డిగర్ల బాలాజీ అన్నారు. మంగళవారం తనికెళ్ల రైతు వేదిక భవనంలో ముందస్తు పంట కాలం, వానాకాలంలో వేయాల్సిన పంటల గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి చివరి వారం కల్లా పంటలు కొసుకుంటే వడగండ్లు, అకాల వర్షాల బారిన పడే ప్రమాదం ఉండదన్నారు. ప్రస్తుతం పత్తి విత్తనాలు పెట్టుకునే రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో రైతులు, అధికారులు

వైభవంగా రామాలయ వార్షికోత్సవం



పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం 50వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామివారికి పంచామృతాభిషేకాలు, హోమపూజలు, పూర్ణాహుతి నిర్వహించారు. హనుమాన్‌భక్త బృందం భజనలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు అనుమోలు సురేష్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు, కొత్తూరు రాజేష్, తోట రమేష్‌బాబు, పుల్లారావు, అర్చకులు ఫణికుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువు పండుగను విజయవంతం చేయాలి

బోనకల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జరగనున్న చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువుల అభివృద్ధికి సంబంధించిన నేమ్ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు మిషన్ కాకతీయ పనులకు సంబంధించి ఏఏ చెరువులలో ఎంత పని చేశారో వివరాలను పొందుపరచాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీఓ శాస్త్రీ, ఎస్సై కవిత, జేఈ రాజేష్, ఏపీఎం పద్మలత, సూపర్‌వైజర్ రమాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన అధికారులు

తల్లాడ: తల్లాడలోని ఎదుళ్ల చెరువును అధికారులు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం చేయాల్సిన ఏర్పాట్లను వారు సమీక్షించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు వారియర్, ఉన్నతాధికారులు హాజరౌతారని ఎంపీడీఓ రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, ఈఓ ఉమా, సొసైటీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, డైరెక్టర్ దగ్గుల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: చెరువుల పండుగను విజయవంతం చేయాలని తహసీల్దార్ డి తిరుమలాచారి కోరారు. స్థానిక తహసీల్‌లో ఆయన మాట్లాడుతూ...గ్రామాల్లోని మత్స్యకారులు, రైతులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు చెరువు కట్టకు చేరుకుని ముగ్గులు, తోరణాలతో అలంకరించాలని సూచించారు. నాయకులు, ప్రజలు సమష్టిగా సహపంక్తి భోజనాలను చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి, ఆర్ఐ అశోక్, సర్వేయర్ అశోక్, సీనియర్ అసిస్టెంట్ అభిరామ్, జూనియర్ అసిస్టెంట్ చందూ తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: చెరువుల పండగ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో చెరువుల పండగ కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణ, సర్పంచ్‌లు తుపాకుల రమాదేవి, కన్నయ్య, లక్ష్మి అధికారులు పాల్గొన్నారు.



తల్లాడ: ఎదుళ్లచెరువును పరిశీలిస్తున్న అధికారులు



ముదిగొండ: మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్



బోనకల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ వేణుమాధవ్



కల్లూరు రూరల్: ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు రూరల్: జలవనరుల శాఖ, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో కల్లూరు మండలంలోని 23 చెరువుల గట్ల పండుగను నిర్వహించనున్నారు. ఈ మేరకు పండుగ ఏర్పాట్లను మంగళవారం అధికారులు పరిశీలించారు.